క్లుప్తంగా

బాలాజీకి సహస్ర పుష్పార్చన



సహస్ర పుష్పార్చనలో శ్రీవారు

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్ ఎస్టీబీఎల్ ప్రాంగణంలోని శ్రీతిరుమల బాలాజీ దివ్య క్షేత్రంలో శ్రీవారికి నిత్యం విశేష పూజలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం అర్ధరాత్రి వరకు ఆలయంలో శ్రీశ్రీదేవి, భూదేవి సమేత బాలాజీకి ప్రత్యేక పుష్పాలతో సహస్ర పుష్పార్చన నిర్వహించారు. తిరుమల బాలాజీ దివ్యక్షేత్రం ట్రస్ట్ ప్రతినిధులు ఆధ్వర్యంలో తోమాలసేవ, నక్షత్ర హారతి, అభిషేకాలు చేశారు.

స్టీల్‌ప్లాంట్ విశ్రాంత జీఎం మల్లికార్జునరావు మృతి



మల్లికార్జునరావు(ఫైల్)

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ విశ్రాంత జనరల్ మేనేజర్ ఎస్.ఆర్. మల్లికార్జునరావు ఆదివారం మృతి చెందారు. స్టీల్‌ప్లాంట్ ఇంజినీరింగ్ షాప్స్ అండ్ ఫౌండ్రీ, టౌన్ అడ్మినిస్ట్రేషన్ తదితర విభాగాల్లో సుదీర్ఘ కాలం పనిచేసి ఆయన పదవీ విరమణ చేశారు. అనంతరం ఆయన స్వస్థలం కాకినాడకు వెళ్లిపోయారు. అక్కడ తన నివాసంలో గుండెపోటుతో మల్లికార్జునరావు మృతి చెందినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు.

దల్లేరి వాతే ప్రేమగీతం ఆవిష్కరణ



దల్లేరీ వాతే ప్రేమగీతం బ్రోచర్ ఆవిష్కరిస్తున్న మురళీధర్‌రెడ్డి తదితరులు

కూర్మన్నపాలెం: తారా బలరాం క్రియేషన్స్‌లో పల్లవి లిడిపి సమర్పించిన దల్లేరి వాతే (మనసులోని మాట) అనే సరికొత్త బంజారా ప్రేమ గీతంను కూర్మన్నపాలెం లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ఎ.మురళీధర్‌రెడ్డి ఆవిష్కరించారు. ఆదివారం కూర్మన్నపాలెం ఫేజ్–6లో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ దల్లేరి వాతే బంజారా ప్రేమ గీతాన్ని వైజాగ్ స్టీల్‌ప్లాంట్ పరిసర ప్రాంతంలో ఎంతో అందంగా చిత్రీకరించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్.కుమార స్వామి, జి.ఆనంద్, ఎం.గోపాల్, బి.వెంకటేశ్వర్లు, బి.కృష్ణ, ఆర్.నర్సింహా, ఎస్.నర్సింగ రావు, టి.ప్రభాకర్, విద్యుత్ కుమార్‌వర్మ, శంకర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ నిర్వాహకుడి అరెస్ట్

అక్కిరెడ్డిపాలెం: ఆన్‌లైన్‌లో క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న ఓ వ్యక్తిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. 69వ వార్డు నాతయ్యపాలెంలో పచ్చిగోళ్ల ప్రకాష్ అనే వ్యక్తి కొంత కాలంగా ఆన్‌లైన్‌లో క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్నాడు. శనివారం పక్కా సమాచారంతో నగర సీపీ డాక్టర్ రవిశంకర్, స్పెషల్ బ్రాంచి ఏసీపీ నాగేంద్రుడు ఆదేశాల మేరకు అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ త్రినాథరావు ఆధ్వర్యంలో టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు చేసి, ప్రకాష్‌ను అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి ఒక ల్యాప్‌టాప్, 2 మొబైల్ ఫోన్లు, బెట్టింగ్ నిర్వహణ సమాచారం ఉన్న 3 పుస్తకాలను స్వాధీనం చేసుకున్నారు. కేసును గాజువాక పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

నేడు జీవీఎంసీలో 'జగనన్నకు చెబుదాం'

దాబాగార్డెన్స్: జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహించనున్నారు. పారిశుధ్యం, పట్టణ ప్రణాళిక విభాగం, రెవెన్యూ, యూసీడీ, ఇంజనీరింగ్ తదితర విభాగాలకు సంబంధించి గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేయవచ్చని మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ తెలిపారు.

కొలువుదీరిన కనకదుర్గమ్మ

- దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం
- తొలి రోజు విశేష పూజలు



76వ వార్డులో దుర్గమ్మను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, దొడ్డి రమణ



దయాల్‌నగర్‌లో అమ్మవారి సన్నిధిలో కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి తదితరులు



బాలా త్రిపురసుందరిగా శ్రీమహాదుర్గమ్మ



ఆదిలక్ష్మి అవతారంలో మహాలక్ష్మి



భారతీదేవిగా మహాసరస్వతి అమ్మవారు

ఉక్కునగరం: నియోజకవర్గంలో ఆదివారం దుర్గాదేవి శరన్నవరాత్రి మహోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. శ్రీమహాదుర్గ, శ్రీమహాలక్ష్మి, శ్రీమహాసరస్వతి అమ్మవార్లు ఒకే మండపంలో వెలసిన అతి అరుదైన త్రిశక్తి దేవాలయంలో వేకువజామున గణపతి పూజ, పుణ్యాహవాచనం, పంచగవ్య ప్రాశన, యాగ దీక్షాధారణ, నవ చండీ మండపారాధన, కలశ స్థాపన, చండీ పారాయణతో పూజా కార్యక్రమాలు మొదలయ్యాయి. ఆలయ ప్రధానార్చకుడు ఫణిశర్మ నేతృత్వంలో అమ్మవార్లకు పంచామృతాభిషేకాలు చేశారు. మధ్యాహ్నం మహాగణపతి, నవగ్రహ హోమాలు, అనంతరం గోత్ర నామార్చన, సాయంత్రం సామూహిక కుంకుమార్చన జరిపారు. శ్రీమహాదుర్గ అమ్మవారు ఆకుపచ్చ వర్ణం చీరతో బాలా త్రిపురసుందరి అవతారం, శ్రీమహాలక్ష్మి అమ్మవారు కాఫీ వర్ణం చీరతో ఆదిలక్ష్మి అవతారం, శ్రీమహాసరస్వతి అమ్మవారు తెలుపు వర్ణం చీరలో భారతీదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ కమిటీల ప్రతినిధులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

వాడవాడలా దసరా సందడి

పెదగంట్యాడ: మండలంలోని పలు ప్రాంతాల్లో దసరా సందడి మొదలైంది. మండపాల్లో దుర్గమ్మవారి ప్రతిమలను ప్రతిష్టించి విశేష పూజలు చేశారు. జీవీఎంసీ 64వ వార్డు గంగవరంలో అంజనీ పుత్ర యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 28 అడుగుల ఎత్తు గల దుర్గాదేవిని రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు దర్శించుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ గాజువాక నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

- జీవీఎంసీ 76వ వార్డులోని పలు ప్రాంతాల్లో కొలువుదీరిన దుర్గమ్మను ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు దొడ్డి రమణ దర్శించుకుని పూజలు చేశారు. తాటికొండ జగదీష్, అండిబోయిన సన్నీ, గాలి బాబురావు తదితరులు పాల్గొన్నారు.
- 74వ వార్డు దయాల్ నగర్ టీవీసీ పాయింట్ తదితర ప్రాంతాల్లో యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మండపాల వద్ద కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఎన్వై నాయుడు, దుర్గారెడ్డి, నర్సీపట్నం నాయుడు, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.
- 76వ వార్డు కన్యకాపరమేశ్వరి పంచాయతన ఆలయంలో దుర్గాదేవిని ప్రతిష్టించి పూజలు చేశారు. అమ్మవారు స్వర్ణ కవచ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గాజువాక: శరన్నవరాత్రి ఉత్సవాలు స్థానిక డ్రైవర్స్ కాలనీలోని ఎల్‌బీఎస్ నగర్ కనకదుర్గ ఆలయంలో ప్రారంభమయ్యాయి. గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, 70వ వార్డు కార్పొరేటర్ ఉరుకూటి చందు, అధిక సంఖ్యలో భక్తులు తొలి పూజలో పాల్గొని తరించారు.

- గాజువాక కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారిని బాలత్రిపుర సుందరిదేవిగా అలంకరించారు. గాజువాక ఆర్యవైశ్య సంఘం, ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు.



గంగవరంలో దుర్గాదేవిని దర్శించుకుంటున్న ఎంపీ జీవీఎల్, కరణంరెడ్డి నరసింగరావు

- 67వ వార్డు గాజువాక హైస్కూల్ రోడ్‌లోని ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాలను గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి ప్రారంభించారు. ప్రత్యేక మండపంలో అమ్మవారిని ప్రతిష్టించి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో 67వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌ఛార్జి పల్లా చినతల్లి, నాయకులు పల్లా పెంటారావు, అచ్యుంనాయుడు, రాజాన వెంకటరావు, రామలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

దుర్గమాంబకు ఫలాలతో అలంకరణ

అగనంపూడి: బొర్రమాంబ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అగనంపూడి దుర్గమాంబ ఆలయంలో దసరా ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. అమ్మవారిని వివిధ రకాల పళ్లతో బాలా త్రిపురసుందరిగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయ కమిటీ చైర్మన్ చిత్తా గణేష్ ఉత్సవ ఏర్పాట్లను పర్యవేక్షించారు.



కన్యకా పరమేశ్వరి దేవాలయంలో బాలత్రిపుర సుందరిదేవిగా అమ్మవారు



అగనంపూడిలో బాల త్రిపురసుందరిగా దుర్గమాంబ



డ్రైవర్స్ కాలనీలో అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి, కార్పొరేటర్ చందు

హోమియో వైద్య శిబిరానికి విశేష స్పందన



మహిళలకు హోమియోపతి మెడిసిన్ గురించి వివరిస్తున్న వైద్య సిబ్బంది

కూర్మన్నపాలెం : తిరుమలనగర్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఎలక్ట్రో హోమియోపతి ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. సాధన ఆస్పత్రి డాక్టర్ జె.రంగారావు, డాక్టర్ నీలిమ, సింహాద్రి ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ హేమంత్‌కుమార్, కె.పవిత్ర తదితర సిబ్బంది రోగులకు వివిధ రకాల పరీక్షలు చేసి, అవసరమైన మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డ్వాక్రా టీమ్ సునీతా, అసోసియేషన్ ప్రతినిధులు నాగభూషణం, కారమరాజు, విశ్వేశ్వరరావు, పరమానందం, సన్యాసిరావు, సత్యనారాయణ, అప్పలనాయుడు, రాము, భాస్కరరావు, వసంతరెడ్డి, పరమేశ్వరరావు, చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వం.. ఆయుష్ గణపతి నిమజ్జనోత్సవం



పూర్ణాహుతిలో పూజా ద్రవ్యాలు వేస్తున్న ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి



ఆయుష్ గణపతిని నిమజ్జన దృశ్యం

అక్కిరెడ్డిపాలెం: గ్లోబెక్స్ పక్కనున్న సీఎంఆర్ స్థలంలో ప్రతిష్టించిన 112 అడుగుల భారీ ఆయుష్ గణపతి నిమజ్జనోత్సవం ఆదివారం నేత్రపర్వంగా సాగింది. రాత్రి స్వామికి విశేష పూజలు నిర్వహించిన అనంతరం ఈ కార్యక్రమం చేపట్టారు. 108 పవిత్ర వృక్షాల నుంచి సేకరించిన 108 వనమూలికలతో 21 రకాల గణపతి పత్రాల కాషాయాలు, 5 పుణ్య నదుల జలాలతో నిర్మించిన 112 అడుగుల ఆయుష్ గణపతి విగ్రహం 27 రోజుల పాటు కొలువైయుంది. ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి చేతుల మీదుగా నిమజ్జనానికి ముందు పూర్ణాహుతి హోమంలో పూజా ద్రవ్యాలను సమర్పించారు. ముందుగా ఉద్వాసన, మహా కుంభాభిషేకం, వేద మంత్రాలు, మేళ తాళాలు, భాజా భజంత్రీలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాల మధ్య అనుపు కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు మహా నిమజ్జనాన్ని తిలకించారు.



నిమజ్జనోత్సవాన్ని వీక్షిస్తున్న భక్తులు

తీరంలో గుర్తు తెలియని మృతదేహం లభ్యం




జోడుగుళ్లపాలెం తీరంలో గుర్తు తెలియని మృతదేహం

ఆరిలోవ: జోడుగుళ్లపాలెం వద్ద మృతదేహం కొట్టుకొచ్చినట్టు స్థానికులు ద్వారా ఆరిలోవ పోలీసులకు సమాచారం అందింది. పోలీసులు అక్కడకు వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడు ఫ్యాంట్, షర్టు జేబుల్లో వివరాలకు సంబంధించిన ఎలాంటి ఆధారాలు లభించలేదు. మృతుడి వయసు 30–35 ఏళ్లు ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాన్ని కేజీహెచ్ మార్చురీకి తరలించి భద్రపరిచారు. మృతుడుకి సంబంధించిన బంధువులు ఎవరైనా పోలీసులను సంప్రదించాలని సీఐ సోమశేఖర్ తెలిపారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

గోపాలపట్నం: గోపాలపట్నం కళింగ వైశ్య సంక్షేమ సంఘ సర్వసభ్య సమావేశం ఆదివారం కొత్తపాలెంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గెంబలి మధుసూదనరావు, కార్యదర్శిగా తూముల దామోదరరావు, కోశాధికారిగా గుడ్ల మిన్నారావు, ఉపాధ్యక్షులుగా తంగుడు గణేష, శిల్లా రాధ, గౌరం అధ్యక్షుడిగా డాక్టర్ కోరాడ సూర్యనారాయణ, సంయుక్త కార్యదర్శులుగా బిళ్ల శాంతిజగదీష్, ముచ్చేటి కనకరాజుతో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా భవిష్యత్తు ప్రణాళికల గురించి చర్చించారు. సంఘం అభివృద్ధికి కృషి చేస్తామని నూతన కార్యవర్గ సభ్యులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు



ప్రమాదంలో దెబ్బ తిన్న ఆటో

మల్కాపురం : రెండు ఆటోలు ఎదురెదురుగా ఢీకొనటంతో ఓ ఆటోలో ఉన్న మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. రైల్వేస్టేషన్ నుండి సింధియా వైపు ఆదివారం ఉదయం ఓ ఆటో వెళ్తోంది. సరిగ్గా అదే సమయంలో డాక్‌యార్డ్ సమీపంలోని సర్దార్ వల్లబాయ్ పటేల్ వంతెన (డాక్‌యార్డ్ బ్రిడ్జి) వద్దకు గంగవరం నుండి నగరంలో గల ఫిషింగ్ హార్బర్‌కు మరో ఆటో వస్తూ మొదటి ఆటోను ఢీకొట్టింది. దీంతో సింధియా వైపు వెళ్తున్న ఆటో డ్రైవర్ దిగువకు పడిపోయాడు. అదే ఆటోలో ఉన్న మహిళ ఎడమ కాలికి తీవ్ర గాయం అయింది. దిగువకు పడిన డ్రైవర్ బయటపడ్డాడు. ఫిషింగ్ హార్బర్ వైపు వెళ్తున్న ఆటో స్వల్పంగా దెబ్బ తినగా, అందులో ఉన్న డ్రైవర్‌కు గాయాలైనట్టు తెలిసింది. అయితే గాయపడిన మహిళ వివరాలు గానీ, ఆటో డ్రైవర్ల వివరాలు గానీ తెలియలేదు. పూర్తిస్థాయి విచారణ అనంతరం వివరాలు తెలపగలమని పోలీసులు తెలియజేశారు.

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణతో భవిష్యత్తు అంధకారం



976వ రోజు దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు–ఆంధ్రుల హక్కు అనే నినాదంతో సాధించుకున్న స్టీల్‌ప్లాంట్ దేశంలోనే నంబర్ 1గా నిలిచిందని, అటువంటి పరిశ్రమను ప్రైవేటీకరిస్తే భవిష్యత్తు అంధకారమవుతుందని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు అన్నారు. కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద 976వ రోజు జరుగుతున్న ఉక్కు రిలే నిరాహార దీక్షా శిబిరంలో సంస్థలోని పలు విభాగాల కార్మికులు, ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ కార్మికులు పాల్గొని, కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కమిటీ నాయకులు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్‌ను అమ్మాలనే నిర్ణయాన్ని తక్షణమే విరమించుకోవాలన్నారు. ఇప్పటికే పన్నుల రూపంలో ప్రభుత్వానికి వేల కోట్ల రూపాయలను అందించిందని, ఎంతో మందికి ప్రత్యక్షంగా, లక్షల మందికి పరోక్షంగా ఆర్థిక, సామాజిక న్యాయం చేస్తున్న విశాఖ ఉక్కును కాపాడుకోవడానికి కేంద్రం తీసుకున్న నిర్ణయానికి వ్యతిరేకంగా రాష్ట్రంలోని ప్రజలందరూ అనేక రూపాల్లో ఆందోళనలను చేయాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. విశాఖ ఉక్కు ప్రభుత్వరంగంలోనే కొనసాగిస్తామని ప్రధాని స్పష్టమైన ప్రకటన చేయాలని, లేనిపక్షంలో తమ ఆందోళన మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

కార్మిక వర్గంపై దాడిని ఐక్యంగా ఎదుర్కొందాం



మాట్లాడుతున్న సీఐటీయూ నేత నర్సింగరావు

ఉక్కునగరం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వర్గంపై చేస్తున్న దాడిని ఐక్యంగా ఎదుర్కొనేందుకు సిద్ధం కావాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు పిలుపునిచ్చారు. స్టీల్‌ప్లాంట్ సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం జరిగిన ఉత్తరాంధ్ర జిల్లాల సిటు నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీలకు లాభాలు చేకూర్చేలా కార్మిక వర్గంపై దాడి చేస్తోందన్నారు. దేశంలోని ప్రభుత్వ రంగ సంస్థలను అంబానీ, అదానీలకు కట్టబెట్టే విధానం అమలు చేస్తోందని ఆరోపించారు. కార్మిక చట్టాలు యజమానులకు అనుకూలంగా మార్చడం వంటి చర్యలకు పూనుకోవడం అన్యాయమన్నారు. కార్మికులకు వేతనాలు పెంచకుండా ఉన్నవి తగ్గించడం, ఉపాధి రక్షణ లేకుండా చేయడం వంటి దుర్మార్గపు చర్యలకు వ్యతిరేకంగా పోరాడాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ ఎం.వి.ఎస్.శర్మ, ఆర్.శంకరరావు, కాకి సురేష్, సత్యనారాయణ, కె.ఎం.శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.కె.ఎస్.వి.కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తూర్పు కాపులకు ఓబీసీ సర్టిఫికెట్లు ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న జీవీఎల్ నర్సింహారావు

గాజువాక: తూర్పు కాపులందరికీ ఓబీసీ సర్టిఫికెట్లు ఇవ్వాలని రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నర్సింహారావు డిమాండ్ చేశారు. గాజువాకలో ఆదివారం నిర్వహించిన తూర్పు కాపు ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. 1972 తరువాత విశాఖ జిల్లాలో జన్మించిన తూర్పు కాపులకు బీసీ డీ, ఓబీసీ సర్టిఫికెట్లు ఇవ్వాలని జిల్లా కలెక్టర్లకు ఏడాది క్రితమే సర్క్యులర్ జారీ చేయించామన్నారు. ఈ సర్క్యులర్‌ను ఏ తహసీల్దారైనా అమలు చేయకపోతే తన దృష్టికి తీసుకురావాలన్నారు. ఆ విషయాన్ని సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పూర్తిస్థాయిలో అమలయ్యేలా కృషి చేస్తామని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 40 లక్షల మంది తూర్పు కాపులకు ఓబీసీ రిజర్వేషన్ కల్పన కోసం కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశపెట్టేలా కృషి చేస్తానన్నారు. ఈ విషయంపై ఇటీవల ఢిల్లీలో కూడా ఎన్‌సీబీసీ చైర్మన్‌ను కలిసి చర్చించామన్నారు. ఈ సమావేశంలో గాజువాక కాపు సంఘం ప్రతినిధులు, నాయకులు కరణంరెడ్డి నర్సింగరావు, ఉంగరాల శ్రీను, డాక్టర్ సింహాచలం, డాక్టర్ రమేష్, కురిటి మాధవనాయుడు, గురునాయుడు, సూర్యభగవాన్, మురళీదేవి, గూటూరు శంకరరావు, జీలకర్ర రమణ, వర్రి లలిత, భువనేశ్వరి పాల్గొన్నారు.

వృద్ధుల భద్రత, సంక్షేమానికి కృషి



మాట్లాడుతున్న హెల్ప్ ఏజ్ ఇండియా ప్రాజెక్టు కో ఆర్డినేటర్ మణిదీప్

అగనంపూడి: బలహీన వర్గాలకు చెందిన వృద్ధుల భద్రత, సంక్షేమం కోసం హెల్ప్ ఏజ్ ఇండియా నిరంతరం కృషి చేస్తోందని సంస్థ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ గుజ్జు మణిదీప్ తెలిపారు. అగనంపూడిలో ఆదివారం నిర్వహించిన సీనియర్ సిటిజన్స్ సమావేశంలో ఆయన మాట్లాడారు. సీనియర్ సిటిజన్ల జీవితాల్లో నాణ్యతను మెరుగుపర్చడానికి వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. వృద్ధులకు తాము అందజేసే గుర్తింపు కార్డులతో బహుళ ప్రయోజనాలు లభిస్తాయని, ప్రతి ఒక్కరూ ఈ కార్డును పొందాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, వివిధ సంస్థల ప్రతినిధులు బలిరెడ్డి నాగేశ్వరరావు, గుదే సుశీల గజేంద్రరావు, ఎవీఎస్ఎం అప్పారావు, బెల్లాల నాగేశ్వరరావు, రఫీ, విందుల వరహాలు, కొలిపాక అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

రెండు కార్లు ఢీకొని ఐదుగురికి గాయాలు



మలుపు తిరుగుతున్న కారు పక్క భాగం దెబ్బతిన్న దృశ్యం



ముందు భాగం నుజ్జయిన ఢీకొట్టిన కారు

అక్కిరెడ్డిపాలెం: మలుపు తిరుగుతున్న కారును వేగంగా వస్తున్న మరో కారు ఢీకొట్టిన ఘటన విశాఖ డెయిరీ పార్లర్ ఎదుట ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. ఈ ప్రమా దంలో ఐదుగురు గాయపడ్డారు. గాజువాక పోలీసులు, ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. టౌన్ నుంచి వస్తున్న కారు నాతయ్యపాలెం వైపు వెళ్లేందుకు మలుపు తిరుగుతోంది.. ఈ కారులో ముగ్గురు మహిళలు, డ్రైవర్ ఉన్నారు. ఇదే సమయంలో పరవాడ నుంచి సింహాచలం వైపు వెళుతున్న కారు బలంగా ఢీకొట్టింది. ఈ కారులో ఏడుగురు ప్రయాణిస్తున్నారు. వీరిలో ముగ్గురితో పాటు ఓ చిన్నారికి గాయాలయ్యాయి. మలుపు తిరుగుతున్న కారులో ఒక మహిళ గాయపడింది. వీరిని షీలానగర్‌లో కిమ్స్ ఐకాన్ ఆస్పత్రికి తరలించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న గాజువాక పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కాపుల సంక్షేమమే ధ్యేయం



మాట్లాడుతున్న జెర్రిపోతుల ముత్యాలు

పెదగంట్యాడ: కాపుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని కృష్ణదేవరాయ గాజువాక కాపు సంక్షేమ సేవా సంఘం అధ్యక్షుడు జెర్రిపోతుల ముత్యాలు అన్నారు. జీవీఎంసీ 76వ వార్డు పరిధి నడుపూరులోని ఉక్కు కళావేదికలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సంఘం ఆధ్వర్యంలో గతంలో అనేక సంక్షేమ సేవా కార్యక్రమాలు నిర్వహించామన్నారు. కార్తీక మాసంలో వన సమారాధన నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. ఈ సమావేశంలో సంఘం నాయకులు తలారి వెంకటరమణ, కరణం అప్పలస్వామి, గల్లా అమ్మాజీ, స్వప్నకుమారి, కనకారావు, దేముడు, తదితరులు పాల్గొన్నారు.